www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024



చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

చలివేంద్రాలు సామాన్యుల దప్పిక తీర్చే ఉపశమన కేంద్రాలుఅని టూ టౌన్ సిఐ యువరాజు అన్నారు. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్స్, మదనపల్లి టూటౌన్ పోలీసులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేసవి దృష్ట్యా సామాన్య ప్రజలు, బాటసారులు, ప్రయాణికులు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతుంటారని తెలిపారు. తాత్కాలికంగా దప్పిక తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అభినందించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సిఐటియు ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మదనపల్లి యూత్ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నిరంకుశ బిజెపిని గద్దె దించడమే లక్ష్యం

- నిరసనలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు



నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిరంకుశ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ఇందుకు కార్మిక, కర్షక, ప్రజాసంఘాలు కలిసి రావాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెస్ రాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం జాతీయ రహదారిలోని ఎన్టీఆర్ కూడలి వద్ద రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటి సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని తెలిపారు. రైతుల రుణాలు మాఫీ కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం, నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని చెప్పారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి పనిదినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. కూలి రూ.600లు పెంచాలని, 2 పూటల పని కల్పించి ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలని కోరారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపరచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని చెప్పారు. కడప ఉక్కును ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. భూహక్కుల చట్టం 27/23ను ఉపసంహరించుకోవాలని, చుక్కల భూములు, బంజరు భూములన్నిటికి పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బంజరు భూములకు కూడా చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల బీమా పథకం పెట్టాలని, సిసిఆర్ చట్టాన్ని సవరించాలని, కౌలు రైతులకే నష్టపరిహారాలు, బీమా ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, బికెఎంయు కార్యదర్శి నరసింహులు, నాయకులు నాగేశ్వరరావు, గంగయ్య, మున్న, రమణ, అబ్దుల్లా, రాఘవ, గిరీష్, పరవాయి సుబ్రహ్మణ్యం, జమాల్, మున్నా, రవి, సుంకన్న, లింగన్న, అంజన్న, కసంగుంట రమణ, నాని, సుబ్రహ్మణ్యం, రమణ, కుమార్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రేయనక, పగలనక ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెడుతున్నటువంటి రైతుల ఉసురు పోసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి పొయ్యే రోజులు దగ్గర పడ్డాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప విమర్శించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో రైతుల నిరసనకు మద్దతుగా గురువారం స్థానిక జ్యోతీ చౌక్ వద్ద ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. రైతు ఉద్యమంలో పోలీసు కాల్పులలో మరణించిన యువరైతు శుభకరన్ సింగ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, నాయకులు జి.రఘునాథ్, ఎస్.తంబయ్యశెట్టి, డి.చిన్న రెడ్డప్ప, ఎం.అష్రఫ్ అలీ, జి.నారాయణస్వామి, జి.శంకర, పి.నారాయణస్వామి, శంకర, జి.ఉత్తన్న, గంగన్న, చిన్న రెడ్డప్ప, కదిరెప్ప, యల్లప్ప, రమణ, నరసింహులు, ఎస్.గంగులప్ప, హబీబ్, గంగాద్రి పాల్గొన్నారు.

రెండో విడతలో టిడిపి అభ్యర్థులు వీరే!

- కమలాపురానికి పుత్తా చైతన్యరెడ్డి
- ప్రొద్దుటూరుకు వరదరాజులరెడ్డి
- మదనపల్లికి షాజహాన్‌బాషా
- జమ్మలమడుగు, బద్వేల్ మిత్రులకేనా?



వరదరాజులరెడ్డి | పుత్తా చైతన్యరెడ్డి | షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లాలోని కమలాపురం, ప్రొద్దుటూరు స్థానాలకు రెండో విడతగా గురువారం టిడిపి అభ్యర్థులను ఖరారు చేసింది. మొదటి విడతలో కడప, మైదుకూరు, పులివెందుల అసెంబ్లీ స్థానాలకు పేర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా విడుదల చేసిన కమలాపురం, ప్రొద్దుటూరు స్థానాలతో కలిపితే ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అవుతోంది. విభజిత కడప జిల్లాలోని కడప, మైదుకూరు, పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేల్ స్థానాల్లో మూడు వంతుల స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు అవుతోంది. మిగిలిన జమ్మలమడుగు, బద్వేల్ అసెంబ్లీ స్థానాల్ని మిత్రులైన బిజెపి, జనసేనకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదల చేసిన కమలాపురం అసెంబ్లీ బరిలో కొత్త అభ్యర్థిని అన్వేషించింది. 2009 నుంచి 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పుత్తా నరసింహారెడ్డి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా మూడు ఓటముల పాలైన అభ్యర్థులను పక్కన బెట్టాలని టిడిపి అధిష్టానం ప్రకటించిన సంగతి తెలిసిందే. కమలాపురం అసెంబ్లీ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి స్థానంలో ఆయన కుమారుడు పుత్తా చైతన్యరెడ్డి పేరును ప్రకటించారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి కేటాయించింది. ఈయన ఆరు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం, బలమైన కేడర్‌ను కలిగి ఉన్న నేపథ్యంలో టికెట్ కేటాయించినట్లు తెలుస్తోంది. టికెట్ రేసులో చివరి వరకు హోరాహోరీగా తలపడిన మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, యువ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనుచరుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏదేమైనా ప్రొద్దుటూరు బరిలో వైసిపి అభ్యర్థికి ధీటైన అభ్యర్థిని టిడిపి నిలపడంతో హోరాహోరీ పోరాటం తప్పదనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లాలో మొదటి విడతలో రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు టికెట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా రెండవ విడత కింద విడుదల చేసిన జాబితాలో మదనపల్లి టిడిపి టికెట్ షాజహాన్‌బాషాకు కేటాయించింది. మదనపల్లి టికెట్ ఆశావహులుగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, బాబూరెడ్డి చివరికి వరకు నిలిచిన సంగతి తెలిసిందే. తాజా విడతలో సిట్టింగ్ ఎమ్మెల్యే సోదరుడైన షాజహాన్‌బాషాకు టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు వైసిపి మొండిచేయి చూపించిన నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కుటుంబీకునికి టిడిపి టికెట్ ఇవ్వడంతో మదనపల్లి రాజకీయం ఆసక్తికరంగా మారింది.

ప్రాంగణ ఎంపికల్లో 'శ్రీసాయి' విద్యార్థుల సత్తా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల కోసం గురువారం ప్రముఖ బహుళ జాతి సంస్థ క్యు స్పైడర్, హైదరాబాద్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక వేతనానికి ఎంపికయ్యారు. ఈ ఉద్యోగ నియామకాల కార్యక్రమానికి క్యూ స్పైడర్ కో ఫౌండర్ కేశవ హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఐటీ రంగ నియామకాల విధివిధానాలను, రాత పరీక్ష ,గ్రూప్ డిస్కషన్, వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగించారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఐటీ రంగం ఉద్వాసన రంగాన్ని అధిగమించి తిరిగి నియామకాల జోరు అందుకుంటుందని వివరించారు. సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుంఇచ పదిమంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుండి ఒకరు ప్రతిభ కనబరిచి సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారికి రూ. 4 లక్షల నుండి రూ. 6 లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని పోటీ పరీక్షల ప్రతిభ కనపరచడానికి అవసరమగు అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్ ,వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి చెందాలి : జెసి



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

వైఎస్ఆర్ ఇబిసి నేస్తం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి 'వైఎస్ఆర్ ఇబిసి నేస్తం' పథకం కింద 45-60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అర్హులైన అగ్రవర్ణాలకు చెందిన అక్క చెల్లెమ్మలకు మూడో విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జెసితోపాటు బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, బిసి కార్పొరేషన్ ఎఇఒ శిరీష, బిసి కార్పొరేషన్ సీనియర్ సహాయకులు ఓబులేసు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమల తోపాటు ఇతర ఒసి సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన పేద మహిళలకు వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుకున్న మహిళలు సొంత వ్యాపారాలు చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు, వారి కుటుంబంలో సంతోషం వెల్లివిరిసేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో 23287 మంది మహిళలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా రూ.34.93 కోట్ల మెగా చెక్కును అర్హులైన మహిళలకు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు : ఎంపిపి

ప్రజాశక్తి - వీరబల్లి

విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఎంతో ఇష్టంగా చదవాలని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ ఇర్షాద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యకుమార్ ఆధ్వర్యంలో పాఠశాల 71 వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంటే క్రమశిక్షణకు మారుపేరు అని, ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు ప్రవేశ పెట్టిన అమ్మ ఒడి, విద్య దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థులు సద్వినియం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల కోసం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాతబడిన పాఠశాలలంటిని కార్పొరేట్ పాఠశాలల దిటుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీష్ మీడియం చదవాలని ఉద్దేశంతో ఇంగ్లీష్ విద్యను ప్రవేశపెట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి తమ సిబ్బంది మొత్తం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షలకు చక్కగా ప్రిపేర్ అయ్యి పాఠశాలకు మంచి ఫలితాలు తీసు కువచ్చి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని అన్నారు. అనం తరం సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతు లు అందజేశారు. పాఠశాల చైర్మన్ ఇర్షద్ బాషను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామరాజు, అసోసియేట్ సైన్స్ ఆఫీసర్ పల్లం రామచంద్ర, పిఇటి వేణుమాధవ్ రాజు, ఉపాధ్యాయులు రెడ్డయ్య, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీలో వెలసిన పోలేరమ్మ తిరుణాల శని, ఆదివారాలు నిర్వహించనున్నట్లు పూజారి మారువేని శంకరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం రాత్రి చెక్కభజనలు, పెద్ద గొడుగు చాందిని బండితో ఆలయం చుట్టూ ప్రదర్శనలు, ఊరేగింపులు ఉంటాయన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల లోపు బోనాలు పూజలు, సాయంత్రం 6 గంటలకు ఆస్వాదిని కథ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

రేపు గాలివీడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక ఎంపిడిఒ ఒక సభా భవనంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గాలివీడు : ఈ నెల 18న నిర్వహించబోయే పదో తరగతి పరీక్షలను మండల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు రాయనున్నారు. ఏడు ప్రభుత్వ, నాలుగు ప్రయివేట్ పాఠశాలలున్నాయి. మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 104 మంది, ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు.

'ఇందిరమ్మ అభయ హస్తం మిన్న'



పథకం గురించి వివరిస్తున్న అలీఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

టిడిపి, వైసిపి పథకాలకంటే ఇందిరమ్మ అభయ హస్తం మిన్న అని డిసిసి మైనార్టీ అధ్యక్షులు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాల్టీ పరిధిలోని కొత్తపల్లి మహమ్మద్ పురవీధి లో మహిళలతో కలిసి ఇందిరమ్మ అభయ హస్తం గురించి వివరించారు. వారి ఓటరు కార్డులను అభయ హస్తం యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనలు సాగిస్తున్నాయని తెలిపారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, విద్యుత్ బిల్లులు, ఆర్‌టిసి ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. సామాన్యుడు బతకాలంటే కష్టంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో కాంగ్రెష్ పార్టీ మహిళల కోసం ఇందిరమ్మ అభయ హస్తం పథకం తీసుకొచ్చిందని చెప్పారు. మహిళలకు బంగారు వరమని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ పథకం ద్వారా పేద కుటుంబానికి నెలనెలా ప్రభుత్వం రూ.5000 ఆర్థిక సాయం అంది స్తుందని చెప్పారు. ఏడాదికి 60 వేల రూపాయలు. 5 సంవత్సరాలకు 3,00000 రూపాయల లబ్ది కుటుంబానికి అందుతుందని అన్నారు. నేరుగా మహిళల ఖాతాలోకి డబ్బు జమ అవుతుందని వివరించారు.

సైనిక్ ప్రవేశ ఫలితాల్లో తనీష్‌కు రెండవ ర్యాంక్

ప్రజాశక్తి - వీరబల్లి

సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే 267/300 మార్కులు చిలకల తనీష్ అనే విద్యార్థి సాధించాడు. విద్యార్థి ఎల్‌కెజి నుంచి 5వ తరగతి వరకు శ్రీవివేకానంద ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నాడు. రాయచోటి మురళీ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుని ర్యాంకు సాధించాడని విద్యార్థి తండ్రి చిలకల భాస్కర్ పేర్కొన్నారు.

వేలం పాటలో పంచాయతీకి రూ.42.42 లక్షల ఆదాయం : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-కలకడ

గ్రామ పంచాయతీ నిర్ణయం అంతిమ నిర్ణయంగా పరిగణించడం జరుగుతుందని మదనపల్లి డిఎల్‌పిఒ నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడ సచివాలయంలో నిర్వహించిన పంచాయితీ టెండర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ల విషయంలో పంచాయతీ వారు తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. కలకడ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.42,42,100 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. టమోటా మార్కెట్ గేటును షఫీ ఉల్లా రూ.23.25 లక్షలకు పాడి కైవసం చేస్తున్నట్టు తెలిపారు. వారపు సంతను శ్రీహరి నాయుడు రూ.13.23 లక్షలకు వేలం పాట పాడినట్టు తెలిపారు. బస్టాండ్ గేటును ఖాదరవల్లి రూ.1.60 లక్షలకు, జంతువధశాలను అబ్దుల్ మునాఫ్ రూ.2,100లకు వేలం పాట ద్వారా కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పంచాయతీ సంబంధించిన గదులను వేలం వేసి మొదటి గదిని సయ్యద్ షా వలి రూ.1,75,200, రెండవ గదిని బాబులు సాహెబ్ రూ.1.32 లక్షలకు మూడవ గదిని మాసూమ్ సాహెబ్ రూ.1,24,800 వేలం పాటలు పాడి సొంతం చేసుకున్నట్టు తెలిపారు.దీనితో పంచాయతీకి రూ.42,42,100 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పారిజాన్ షావత్ అలీ, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, సిబ్బంది శ్రీనివాసులు, శ్రీలత , వేలం పాట దారులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న డిఎల్‌పిఒ నాగరాజు



విలేకరులతో మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

ఐక్యతతోనే వాల్మీకుల ఎస్‌టి పునరుద్ధరణ

ప్రజాశక్తి-మదనపల్లి

వాల్మీకులందరూ ఐకమత్యతో ఉద్యమించినప్పుడే ఎస్‌టి పునరుద్ధరణ సాధ్యమవుతుందని పలువురు వాల్మీకి నాయకులు పేర్కొన్నారు. వాల్మీకి ఇండిపెండెంట్ అభ్యర్థులను గెలిపించాలని వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మదనపల్లి వాల్మీకి సంఘం కార్యాలయంలో ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే అభ్యర్థిగా సద్దల జయసింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ లక్ష్యంగా రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సమన్వయంతో ప్రజాస్వామ్య రాజ్యాంగ రక్షణ నిర్మాణం చేస్తూ హక్కులను సాధించుకోవాలన్నారు. ఇండిపెండెంట్ వాల్మీకి అభ్యర్థులుగా రాష్ట్రమంతా ఎన్నికల్లో పోటీ చేసి వాల్మీకుల సమస్యలను ప్రజాక్షేత్రంలో ఉంచాలనే ఉద్దేశంతో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలలో పోటీ చేస్తు న్నామన్నారు. రాజకీయ పార్టీలు ప్రజలకు చేసిన ద్రోహాన్ని గమనించి రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వాల్మీక అభ్యర్థులకు ఓట్లు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వలసల మంజునాథ్, నరసింహులు, మునగమాను రెడ్డి శేఖర్, ఎద్దుల శ్రీనాథ్, బొంత సోమశేఖర్, దాసరి రవి, ప్రొద్దుటూరు నారాయణస్వామి, రామప్ప, అరవనిర్మలమ్మ, వై.నాగరాజా, టి.జయరాజ్, కె.చంద్రశేఖర్, బి.దాము పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో 'మండిపల్లి' కుటుంబం

ప్రజాశక్తి-చిన్నమండెం : రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధి జరగుతుందని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత పేర్కొన్నారు. ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపుతామని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లి : చీటీలపేరుతో ఎంతోమంది పేద ప్రజలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, రిటైర్డ్ ఉద్యోగులు, పూల వ్యాపారస్తులను మోసం చేసిన సుధాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బహుజన్ యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. గురువారం బాధితులు, బహుజన యువసేన నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి ఎంతోమంది దగ్గర చీటీల పేరుతో కోట్ల రూపాయలను వసూలు చేసి ఇప్పుడు నాకు సంబంధం లేదంటున్నారని తెలిపారు. పథకం ప్రకారమే నెల జీతానికి వచ్చిన కృష్ణారెడ్డిపైన లావాదేవీలు నడుపుతూ, ఇప్పుడు డబ్బులు తిరిగి చెల్లించాల్సిన సమయం వచ్చేసరికి అతనిని ఇరికిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయాలని ఉద్దేశం తోనే పోలీసు వారితో, డిపార్ట్మెంట్ వారితో మంచి సంబంధాలు పెట్టుకు న్నాం న్నారు. పోలీసులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని విమర్శిం:చారు. సుధాకర్‌రెడ్డిని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చ ిరించారు. కార్యక్ర మంలో బాధితులు విజయ్ కుమారి, లోకేష్ బాబు, రామకృష్ణ, సుబ్బారెడ్డి, బహుజన్ యువసేన నాయకులు హరీష్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
శుక్రవారం (సా)	శనివారం (ఉ)
6.30	5.07

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రవాణా శాఖ, పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై వివిధ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అవసరమైన ప్రతి చోట సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణా శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగే స్థలాన్ని గుర్తించి, అక్కడ కనీస భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు సహాయం చేసిన వ్యక్తులకు గుడ్ సమార్టిన్ పథకం కింద నగదు పురస్కారం అందిస్తారని, దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అప్రోచ్ రోడ్డు నుంచి హైవే రోడ్డు బాగా కనిపించేలా జంగిల్ క్లియరెన్స్ చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి రవాణా శాఖ అధికారి దినేష్ చంద్ర, డిఎస్‌పి మహబూబ్ బాషా, రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇన్‌స్పెక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వై.కోటలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రూపానందరెడ్డి

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన 'ముక్కా'

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలోని వై.కోట గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా మంచి నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సొంత నిధులు రూ.ఐదు లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.కోట గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిసి ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. శుభ్రమైన తాగునీటి వసతి లేక ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల మనుగడకు కనీస వసతులలో ఒకటైన నీటిని కూడా నేటి ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయలేకపోయిందన్నారు. ఈ సందర్భంగా ఆయన భగీరథుడిలా తమ కష్టాలు తీర్చిన ముక్కా రూపానందరెడ్డికి ఆ గ్రామ వాస్తవ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. అడిగిన వెంటనే సహాయం చేయడానికి సదా ముందుండే ఇలాంటి నాయకుడే నేటి సమాజానికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐక్యత వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజలకు అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అసాంఘిక కార్యకలాపాలతో యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగులయ్యగారిపల్లె, పారేసువారిపల్లెలో ఎస్ఇబి (స్పెషల్ ఫోర్స్) పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులయ్యగారిపల్లె, పారేసువారిపల్లెకు చెందిన వ్యక్తులు గ్రామ సమీపాలలో నాటు సారాను తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో, స్పెషల్ ఫోర్స్‌తో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. నాటు సారా తయారీ స్థావరాలను కనుక్కొని బెల్లంను ధ్వంసం చేసామన్నారు. సారా తయారీకి నిల్వ ఉంచిన 500 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసామని పేర్కొన్నారు. అనంతరం ప్రజలతో, యువతతో సమావేశం ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలపై, అడవులకు నిప్పు పెట్టడంపై, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, ఎస్ఇబి సిబ్బంది, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పోకనాటి వీధిలో ఉన్న బోర్ పాయింట్‌లో రిబోరింగ్ పనులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోకనాటి వీధి ప్రజలు మాట్లాడుతూ నీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటి సమస్య తలెత్తకుండా చేసేందుకు రీబోర్ వేసి నీటి సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టండని అధికారులకు తెలపారన్నారు. తక్షణ స్పందించిన అధికారులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నీటి సమస్య తలెత్తకుండా ప్రజలకు నీరు అందించే విధంగా కృషి చేయాలని నగర పంచాయతీ అధికారులను కమిషనర్ పి.ఆర్.ఆర్.మనోహర్ ఆదేశించారు. బుధవారం రాత్రి పోకనాటి వీధిలో ఉన్న బోరు పాయింట్‌లో రిబోరింగ్ వేశారు. పోకనాటి వీధి ప్రజలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, కమిషనర్ పి.ఆర్.మనోహర్లకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, ప్రజలు, పాల్గొన్నారు.

నిమ్మనపల్లి ఎంపిడిఒగా షాలెట్

ప్రజాశక్తి నిమ్మనపల్లి



బాధ్యతలు స్వీకరిస్తున్న షాలెట్

నిమ్మనపల్లి నూతన ఎంపిడిఒగా కె.షాలెట్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న బి.మైథిలి ఎన్నికల బదిలీలో భాగంగా చిత్తూరు జిల్లా శాంతిపురం మండలానికి బదిలీ కాగా, తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎంపిడిఒగా పనిచేస్తున్న కె.షాలేట్ బదిలీపై నిమ్మనపల్లెకు వచ్చారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇటీవల జరిగిన ఎన్నికల బదిలీలల్లో ఒకే పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బదిలీ అయిన, నియోజకవర్గ పరిధిలోకి చెందిన అధికారులను, ఎలక్షన్ కమిషన్ పునఃబదిలీలను చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా పారదర్శకంగా చర్యలు చేపడతామని తెలిపారు.

సర్వజనహితం జనసేన లక్ష్యం : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : సర్వజనహితం జనసేన లక్ష్యమని నియోజకవర్గ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామ న్నారు. సమసమాజ స్థాపనకు, పూరించిన సమర శంఖం జనసేన ప్రస్థాన మని తెలుపుతూ నవశకానికి మనదైన ముద్ర వేస్తూ, సుపరిపాలనే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధి కొరకు, ప్రజాశ్రేయస్సు కోసం జరగబోయే రేపటి ఎన్నికల తుదిపోరులో గెలుపు బాటకై రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, నాసర్ ఖాన్, భీమినేని రమేష్, పత్తి నారాయణ, కటారు బాబు, రాజేష్ వర్మ, ఆకుల చలపతి, రామచంద్ర, కుళాయప్ప, మౌల, హరికృష్ణ, నాగరాజ, హరి, ఏనుగుల మల్లి, గాజుల మల్లికార్జున, ముత్యాల చలపతి, పూల మురళి, నామాల శంకర, కోళాటం నరసింహ పాల్గొన్నారు. **మదనపల్లి :**జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కమ్మవీధిలో పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి గంగారపు స్వాతి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర భవిష్యత్తు కొరకు పార్టీని స్థాపించి ఎన్నో సమస్యలపై పోరాటం చేసారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, నాయకులు పవన్ శంకర, రాజారెడ్డి, కుమార్, చంద్రశేఖర, నాగరాజు, జవిలి మోహనకృష్ణ, జంగాల గౌతమ్, గండికోట లోకేష్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం టిటిడి అధికారులు జోరుగా ఏర్పాటు పూర్తి చేశారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో ప్రారంభించనున్నారు. 16వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం, 17వ తేదీ ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి హనుమంత వాహనం, 18వ తేదీ కల్పవృక్ష వాహనం, రాత్రి సింహ వాహనం, 19వ తేదీ ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనం, 20వ తేదీ ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గజ వాహనం, 21వ తేదీ ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, రాత్రి 11గంటలకు గరుడ వాహనం, 22వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం ధూళీ ఉత్సవం, 23వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, రాత్రి పార్వేట ఉత్ససం అనంతరం అశ్వవాహనం, 24వ తేదీ ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజా అవరోహణం, 25వ తేదీ ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగం కార్యక్రమంతో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-నందలూరు

రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి హెచ్చరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024 దృష్ట్యా ఎస్‌పి కృష్ణారావు, రాజంపేట డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య ఆదేశాల మేరకు మండల పరిధిలోని లేబాక గ్రామంలో గురువారం రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ అబ్దుల్ జహీర్, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించడమే మా కర్తవ్యమన్నారు. అనంతరం పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్ నాయక్, కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లేబాకలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం చెంగల్రాయుడు

ప్రజాశక్తి-కలకడ

పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు చెంగల్రాయుడు తెలిపారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధగా చదివి పదవ తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. పదవ తరగతి జీవితానికి తొలి మెట్టని దీనిని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పదవ తరగతి పాసైన తర్వాత ఐదేళ్లు ఇష్టపడి చదివితే మిగతా జీవితమంతా సుఖంగా జీవించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, రమేష్ రెడ్డి, రెడ్డప్ప, సైరాబాను, నౌషాద్ బేగం, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

బాలసదన్ చిన్నారులకూ...

రాజంపేట అర్బన్ : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్నూరులోని బాల సదన్ చిన్నారులకు జనసేన నాయకులు బాల సాయి కృష్ణ ఆర్థిక సహకారంతో సీతారామపురం పంచాయతీ జనసేన నాయకులు కోడూరు సాయి, పులి శివరామకృష్ణ, పొగడతోటి సాయి కృష్ణ, రాజంపేట నాయకులు నంద్యాల హరి ఆధ్వర్యంలో గురువారం విద్యాసామాగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవే పరమావధిగా జనసేన ప్రతి ఆవిరావం జరిగిందని తెలిపారు. పేదలు, నిరాశ్రయులకు ఆపన్న హస్తం అందించడంలో జనసైనికులు ముందు వరుసలో ఉంటారని అన్నారు. అనాధ పిల్లలు చక్కగా విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రసాద్, గడ్డం వెంకటేష్, మారే సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే రాజన్న క్యాంటీన్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పేదల ఆకలి తీర్చడం కోసమే రాజన్న క్యాంటీన్ ఏర్పాటు చేశామని ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయి కిషోర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్,శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం రైల్వే కోడూరు పట్టణ వైసిపి కార్యాలయ ఆవరణంలో రాజన్న క్యాంటీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు,ఉప సర్పంచ్ తోట శివ సాయి, వైసిపి పట్టణ ఉపాధ్యక్షుడు రవుఫ్, రమణారెడ్డి, వినోద్ కన్నా, తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పవిత్ర రంజాన్ మాసపు ఉపవాసాలను పురస్కరించుకొని ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వ రైస్ గోడౌన్ హమాలీలుగా పనిచేస్తున్న వారికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో నిష్టతో ఉపవాసాలు ఉంటారన్నారు.ముఖ్యంగా హమాలీలకు పని భారం ఎక్కువగా ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని వారి అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశామన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. ఆ అల్లా కృపతో ముస్లిం మైనార్టీలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికలకు వైసిపికి చెందిన బూత్ కమిటీలకు, నాయకులకు ఎన్నికల సంసిద్ధంపై సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ నరసింహారెడ్డి, ఎంపిపి నరసింహులు, మండల కన్వీనర్ సదాశివరెడ్డిలతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాదని, పార్టీ నియమించిన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ కమిటీలు ఓటర్ జాబితాను ముందుగా పరిశీలించుకుని పార్టీ అధిష్టానం సూచించిన మేరకు ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. వైసిపి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఓటరు వైసిపికి ఓటు వేసి, వేయించి అఖండ మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. వైసిపి సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, చేసిన మంచినీ వివరించి వారి నుంచి పార్టీకి ఓటు వేసి, వేయించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఆర్.ఐ.రమణారెడ్డి, సర్పంచులు మహాదేవ రెడ్డి, సుబ్రమణ్యం, చెండ్రాయుడు, నాయకులు శోభ, దయాకర్ రెడ్డి, శ్రీనివాసులు, రెడ్డి భాస్కర, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

శెట్టిగుంట, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు చొరవతో, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజరెడ్డి సహకారంతో మంజూరు అయిన సచివాలయం భావనానికి ఏపీ టూరిజం డైరెక్టర్, గంగాధర నెల్లూరు ఎన్నికల పరిశీలకులు వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఆనాల చంగల్ రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు మాదినేని వెంకట రెడ్డి, వైసిపి యువ నాయకులు కొరముట్ల చంద్ర శేఖర్, ఉప్పరపల్లి మహేష్,దుర్గా

ఎన్నికల నియమావళిపై అవగాహన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలా రాణి ఐదు మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనున్న సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐదు మండలాల రెవెన్యూ అధికారులకు ఎన్నికల విధులకు సంబంధించి సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఫిర్యాదు చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శివరాముడు, డిప్యూటీ తాసిల్దారు అమరేశ్వరి, రీ సర్వే డిటి మానస, ఆర్ఐ రాజశేఖర్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆరు పథకాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కలికిరి

సూపర్ సెక్స్ పథకాలను ప్రజలు అవగాహన కల్పిస్తూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్ రెడ్డి సతీమణి తనుజ రెడ్డి కలికిరిలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక మండల కేంద్రంలోని నాలుగు రోడ్లు కూడాలలోని స్టేట్ బ్యాంక్ ఏరియా నందు ఆమె తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో భాగంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో గడపగడపకు తిరిగి పథకాల యొక్క పాంప్లెట్లను పంచి పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ యొక్క మేనిఫెస్టో ప్రతి కుటుంబంలో ఆర్థిక భరోసా లభిస్తుందని, మహిళలకు పెద్ద పీట వేస్తారని రాబోవు ఎన్నికలలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ జడ్పీటిసి మాలతి, హజరత్ ముస్తఫా, మైనార్టీ యువ అధ్యక్షుడు మున్వర్ అలీ, తిప్పారెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి- కలకడ

సచివాలయంచ, ఆర్‌బికె భవనాలను పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డిచే ప్రారంభించనున్నట్లు మండల సచివాలయం కన్వీనర్ మోహన్ రాజా నాయుడు తెలిపారు. మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బికే భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రారంభోత్సవాలకు మండలంలోని వైసిపి కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నందలూరు పంచాయతీలో ఉన్న ముస్లిం శ్మశానవాటికకు ప్రహరీ, విద్యుత్తు లైన్, నీటి వసతి ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని కలిసి నందలూరు మండల ముస్లిం మతపెద్దలు గురువారం వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా సమస్య విన్న ఆకేపాటి తక్షణమే స్పందించి దానికి అవసరమయ్యే సహాయాన్ని అందిస్తామని నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి-నందలూరు : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఎంపిడిఒ శేఖర్ నాయక్ సూచించారు. గురువారం నాగిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో బిఎల్‌ఒలు, పంచాయతీ సెక్రెటరీలకు రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంఇఒ నాగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి, ఆర్ఐ సుశీల్, వీఆర్వో రాజు, రెవిన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

వినియోగదారులకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో రూ.3.02 కోట్ల అంచనా వ్యయంతో గట్టు గ్రామం దిమ్మమీదపల్లి, ఇందిరమ్మ కాలనీలో నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లకు గురువారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. పిటిఎం మండలంలో చెంద్రాయనపల్లిలో రెండు సబ్ స్టేషన్లుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించడానికి ఈ సబ్ స్టేషన్లు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుణ్యవతి, విద్యుత్ డిఇ యుగంధర్, ఎఇ గిరిధర్, సర్పంచ్‌లు గుడిపల్లి రఘు, రవి, ఎంపిటిసిలు రామసుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ఆర్.సి.ఈశ్వర్‌రెడ్డి, భీమిగాని ప్రభాకర్‌రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్, మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, మండల జె.సి.ఎస్.కన్వీనర్‌రెడ్డి హరి, సచివాలయ కన్వీనర్లు శెట్టిపల్లి రమేష్‌రెడ్డి, గుమ్మడికాయల చాంద్‌బాషా,జె.ఎన్.పి.శ్రీనివాసులు,అంజమ్మ, ఫయాజ్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, నాయకులు నరసింహనాయుడు, కృష్ణయ్య, బసిరెడ్డి, సద్దాం, జయ, సాయి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ఎసిడిపిఒ సరళా దేవి అన్నారు. సిడిపిఒ టిపి సౌభాగ్యమ్మ ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలలో భాగంగా రైల్వేకోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సెట్టిగుంట సెక్టార్‌లోని మాధవరం పోడు అంగన్వాడీ కేంద్రంలో ఎసిడిపిఒ సరళా దేవి, సెక్టార్ సూపర్వైజర్ గుణవతి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల విశిష్టత వాటి ప్రయోజనాల గురించి తల్లిపాల విశిష్టతను గురించి పిల్లలలో పెరుగుదల పర్యవేక్షణ గురించి అవగాహన కల్పించారు. ప్రాజెక్టు పరిధిలోని ఓబనపల్లి పంచాయితీ, చియ్యవరం, కోడూరు, పుల్లంపేట మండల పరిధిలోను పోషణ్ పక్వాడ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీలు

క్రైం కార్నర్



నిందితుడితో పోలీసులు

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయ స్థావరంపై గురువారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్‌రెడ్డి తెలిపారు. నిమ్మనపల్లి పంచాయతీ నాగంవారిపల్లెకు చెందిన కందూరి కృష్ణ గ్రామానికి సమీపంలో నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంపులో దూకి బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లి

నీటి సంపులో దూకి బాలిక బలవన్మరణం చెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో కలకలం రేపింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెంచుపాడు గ్రామం, పందివారిపల్లెకు చెందిన శాంతమ్మ మల్లికార్జున రెండేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి తన తమ్ముడిని పోషించుకుంటున్న భారతి(15) తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంటరి జీవితాన్ని వెళ్ళదీస్తోంది. ఇంతలో ఆ పసికందుకు ఏం కష్టం వచ్చిందో ఏమో తన అక్క ఇంట్లో ఉండడం ఇష్టం లేక గ్రామానికి ఆనుకుని ఉన్న నీటి సంపులో దూకి ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించారు. కాగా భారతి ఆత్మహత్య చేసుకుని చనిపోయిందా లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎం.శేఖర్ తెలిపారు.

గుంతలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

మొలకచెరువు నుంచి మదనపల్లి వరకు చేపట్టిన రహదారి పనులు చేపట్టారు. ఈ రహదారి పనులు రెండు నెలల క్రితం ములకలచెరువులో చేపట్టారు. స్థానిక కెనరా బ్యాంక్ ఎదురుగా మురికి నీటి కాలువ ఏర్పాటు కోసం గుంత తవ్వి వదిలేశారు. మొలకలచెరువు మండలం సోంపల్లి పంచాయతీ, బత్తినివారిపల్లి చెందిన రవీంద్ర(45) సొంత పనుల మీద మలకలచెరువు వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా కెనరా బ్యాంక్ సమీపంలో మురికి నీటి కాలువ కోసం ఏర్పాటు చేసిన గుంతకు రోడ్డుపై ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారుడు సక్కగా రోడ్డుపై రావడంతో గుంతలోపడ్డాడు. ఈ ప్రమాదంలో రవీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లి తరలించారు, మదనపల్లి నుంచి బెంగళూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త మదనపల్లి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మృతి భార్య పిర్యాదు మేరకు కెసివిఆర్ కాంట్రాక్ట్ సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మలకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.